andhrajyothy.com


ఆంధ్రజ్యోతి


నిజామాబాద్

జిల్లా వార్తలు

5

ఆదివారం 28 జూలై 2024





» దీపావళి తర్వాత నిర్వహిస్తామని సీఎం ప్రకటన » సీఎం వ్యాఖ్యలతో ఆయా పార్టీల నేతల్లో కదలిక
» జీపీ పాలకవర్గాల పదవీకాలం ముగిసి ఆరునెలలు కావస్తుండడంతో ప్రభుత్వం దృష్టి
» పోటీ చేసేందుకు ఇప్పటినుంచే గ్రామాల్లో కార్యక్రమాలకు ఏర్పాట్లు
» జిల్లాలోని గ్రామ పంచాయతీలకు విడుదల కాని కేంద్ర, రాష్ట్రాల నిధులు.. గ్రామాల్లో పేరుకుంటున్న సమస్యలు

స్థానిక ఎన్నికలపై దృష్టి!

నిజామాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వచ్చే దీపావళి తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిస్తామని సీఎం ప్రకటించడంతో జిల్లాలోని పార్టీల నేతల్లో కదలిక మొదలైంది. ఎన్నికలపై కదలిక లేకుండా ఉండటంతో గ్రామ స్థాయిలో నేతలు సబ్బుగా ఉన్నారు. పదవీకాలం ముగిసినప్పుడే పోటీకి ఎక్కువ మంది సన్నద్ధం కాగా ప్రభుత్వం వాయిదా వేయడంతో వేచి చూస్తున్నారు. సీఎం నిర్ణయం తీసుకోవడం అధికా రులను ఆదేశించడంతో మళ్లీ గ్రామాల్లో రాజకీయ పార్టీల కార్యక్రమాలు పెరగనున్నాయి. గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీకాలాలు ముగిసి ఆరునెలలు కావస్తుండడంతో ప్రభుత్వం దృష్టిపెట్టింది. గ్రామ, మండల, జిల్లాస్థాయిలోని అన్ని స్థానిక సంస్థల్లో పదవులు ఖాళీగా ఉండటం, ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుండటంతో ఈ ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. బీసీ కమిషన్ నివేదిక ఇవ్వగానే రిజర్వేషన్లకు అనుగుణంగా ఎన్నికలను నిర్వహించనున్నారు.

• దీపావళి తర్వాత ఎన్నికలు?

రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు దీపావళి తర్వాత ఎన్నికలు నిర్వహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అధికారులతో స్థానిక సంస్థల ఎన్నికలపై సమీక్షించారు. బీసీ కులగణన, ఓటరు లిస్టు అంశాలను చర్చించారు. ఇవన్నింటిని త్వరలో పూర్తిచేసి గ్రామ, మండల, జిల్లా ప్రజాపరిషత్‌ల ఎన్నికలను నిర్వహిస్తామని ప్రకటించారు. సీఎం ఈ ఎన్నికలపై స్పష్టత ఇవ్వడంతో జిల్లాలోని అన్నిపార్టీల నేతల్లో పదవులపైన మళ్లీ ఆశలు పెరిగాయి. అధికార కాంగ్రెస్ పార్టీ నేతలతోపాటు బీఆర్ఎస్, బీజేపీ, ఇతర పార్టీ నేతలు కూడా స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పదవీకాలం పూర్తయ్యేలోపే అన్నీసిద్ధం చేస్తున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడటం, కాంగ్రెస్ పదేళ్ల తర్వాత అధికారంలోకి రావడంతో వరుస ఎన్నికలు నిర్వహించేందుకు సమయం తీసుకున్నారు. సీఎం ప్రస్తుతం ఈ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించడంతో అధికార కాంగ్రెస్ పార్టీ నేతల్లో ఉత్సాహం కన్పిస్తోంది. పదేళ్ల పదవులకు దూరంగాఉన్న నేతలు ప్రస్తుతం తమ పార్టీ అధికారంలో ఉండటంతో ఈ దఫా తమకు అవకాశం వస్తుందని భావిస్తున్నారు. స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు ఏర్పాట్లను చేసుకుంటున్నారు. కీలకమైన సర్పంచ్, మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడు, జడ్పీటీసీలు, జెడ్పీచైర్మన్‌గా ఎన్నికయ్యేందుకు పావులు కదుపుతున్నారు. గ్రామాల్లో చురుకుగా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. గత ప్రభుత్వం రిజర్వేషన్ల ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించింది. సుప్రీం కోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం ఈ దఫా బీసీ గణన పూర్తయిన తర్వాత రిజర్వేషన్ ఖరారు చేసి ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ ఎన్నికలు తమకు అనుకూలిస్తాయని అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు భావిస్తుండగా ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీకి చెందిన నేతలు కూడా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. మెజార్టీ స్థానాలపై నజర్ పెట్టి పనిచేస్తున్నారు. గ్రామ, సర్పంచ్ ఎన్నికలు పార్టీ రహితంగా జరుగుతున్న ఆయా పార్టీల మద్దతుతోనే అభ్యర్థులు పోటీకి దిగుతున్నారు. మండల, జిల్లా పరిషత్ స్థాయిలో పార్టీల గుర్తులపైనే అభ్యర్థులు పోటీచేస్తారు. ప్రస్తుతం ఉన్న అంశాలతో పాటు గ్రామాల్లో స్థానికత అనుకూలిస్తుందని ఎక్కువ మంది పోటీ కోసం ముందస్తుగానే సిద్ధమవుతున్నారు. సీఎం ప్రకటించడంతో ఈ ఎన్నికలపై అందరికీ స్పష్టత రావడంతో పాటు మరో 3నెలల పాటు గ్రామాలు, మండల స్థాయిలోనే ఉండి కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆయా పార్టీల నేతలు సిద్ధమవుతున్నారు.

• పాలకవర్గాల పదవీకాలం ముగిసి ఆరునెలలు

గ్రామ పంచాయతీ సభ్యుల పదవీకాలం పూర్తై దాదాపు 6నెలలు కావస్తోంది. ఫిబ్రవరి 5 నుంచే జిల్లాలో గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారుల పాలన మొదలైంది. అప్పటినుంచి వారి ఆధ్వర్యంలోనే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. జిల్లాలో మొత్తం 530 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు మొదలైతే ఈ గ్రామ పంచాయతీల పరిధిలో ఎన్నికలను నిర్వహించనున్నారు. వీటితోపాటు అన్ని గ్రామాల పరిధిలో మొత్తం 4,932 వార్డులు ఉన్నాయి. వీటన్నింటికీ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించనున్నారు. ప్రభుత్వం నిర్ణయం తీసుకొని ఓటరులిస్టు సిద్ధం చేసిన తర్వాత రిజర్వేషన్లకు అనుగుణంగా గ్రామ పంచాయతీల పరిధిలో ఈ ఎన్నికల నిర్వహణ చేపట్టనున్నారు. 3 సబ్ డివిజన్ల పరిధిలో ఎన్నికలను నిర్వహిస్తారు. బ్యాలెట్ ఆధారంగా ఈ ఎన్నికలను నిర్వహించడంతో పాటు అదేరోజు ఫలితాలను ప్రకటిస్తారు.

• గ్రామాల్లో పెరుగుతున్న సమస్యలు

జిల్లాస్థాయిలో 530 గ్రామ పంచాయతీలకు సర్పంచులతోపాటు పాలకవర్గాలు లేకపోవడంతో పలు సమస్యలు కూడా ఎదురవుతున్నాయి. జిల్లావ్యాప్తంగా ప్రత్యేక అధికారుల పాలన అన్ని పంచాయతీల్లో కొనసాగుతున్నా అధికారులు అప్పుడప్పుడు వచ్చి పోవడం వల్ల పూర్తిస్థాయిలో సమస్యలను పరిష్కరించేవారు లేరు. అన్ని గ్రామాలకు నిధుల సమస్య కూడా ఎక్కువగా ఉంది. గ్రామ పంచాయతీలకు 15నెలలుగా స్టేట్ ఫైనాన్స్ నుంచి నిధులు రావడం లేదు. అదే రీతిలో ఆరు నెలలుగా కేంద్రం నుంచి కూడా గ్రాంట్స్ పంచాయతీలకు విడుదల కావడంలేదు. దీని వల్ల గ్రామాల పరిధిలో రోజువారి కార్యక్రమాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గ్రామ పంచాయతీల్లో సిబ్బందికి జీతాలు ఇచ్చేందుకు కూడా నిధులు సరిపోవడంలేదు. జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో పన్నులు పూర్తిస్థాయిలో వసూలు చేయడంతో ఆ నిధులను ప్రస్తుతం అత్యవసరాలకు ఉపయోగిస్తున్నారు. రాష్ట్ర, కేంద్రప్రభుత్వాలు నిధులు విడుదల చేస్తే రుణాలు చెల్లింపుతోపాటు ఉద్యోగులకు జీతాలను సక్రమంగా ఇచ్చేపరిస్థితి ఉంది. గ్రామాలకు పూర్తిస్థాయి పాలకవర్గాలు లేకపోవడంతో కూడా నిధులపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేవారే కరువయ్యారు.

• ఆగస్టు 1తో ముగియనున్న ప్రత్యేక పాలన

గ్రామ పంచాయతీలకు నియమించిన ప్రత్యేకఅధికారుల పాలన కూడా ఆగస్టు 1వ తేదీతో ఆరునెలలు ముగియనుంది. ఆ తర్వాత మళ్లీ పొడగింపును ఇవ్వనున్నారు. ఎన్నికలు జరిగేంతవరకు ప్రత్యేక అధికారులను కొనసాగించనున్నారు. ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు నిర్ణయం తీసుకొని నిర్వహిస్తే మొదట పంచాయతీలను పూర్తిచేసిన తర్వాత మండల, జెడ్పీ ఎన్నికలను నిర్వహించనుంది. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా జిల్లాలోని ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో ఓటరు లిస్టుతోపాటు రిజర్వేషన్ ప్రక్రియను పూర్తి చేస్తారు. సీఎం ఈ ఎన్నికలపై ప్రకటించడంతో జిల్లాలోని ఆయా పార్టీల నేతల్లో కదలిక మొదలు కాగా ప్రభుత్వం దీపావళిలోపు బీసీ గణన పూర్తిచేసి రిజర్వేషన్లను ఖరారు చేస్తే ఈ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. రిజర్వేషన్ నిర్ణయం ఆలస్యమైతే మరికొంత కాలం ప్రత్యేక అధికారుల పాలన కొనసాగే అవకాశం ఉంది.



సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్న ట్రైనర్లు

సీపీఆర్‌తో ప్రాణం కాపాడొచ్చు

• దీనిపై ప్రతీఒక్కరికి అవగాహన అవసరం

• జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్

నిజామాబాద్ అర్బన్, జూలై27: అకస్మాత్తుగా గుండెపోటుకు గురైన వ్యక్తిని సీపీఆర్ (కార్డియో పల్మనరీ రీసక్సిటేషన్) చేసి ప్రాణం కాపాడొచ్చని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ అన్నారు. ప్రాణపాయ బారినుంచి కాపాడేందుకు ఎంతగానో ఉపకరించే సీపీఆర్ (కార్డియో పల్మనరీ రీసక్సిటేషన్) నిర్వహణ విధానంపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉద్యోగులతోపాటు వివిధ వర్గాల వారికి సీపీఆర్ శిక్షణ ఆవశ్యకతపై శనివారం జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో పునర్జన్మ పేరుతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆకస్మికంగా గుండెపోటుకులోనై ప్రాణాపాయస్థితికి చేరిన వారికి సీపీఆర్ ప్రక్రియను ఎలా అందించాలనేదానిపై రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లు ప్రయోగాత్మకంగా చేసి చూపిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో తుకారాం మాట్లాడుతూ సీపీఆర్ అనే చిన్నప్రక్రియ ద్వారా ఎంతో విలువైన నిండు ప్రాణాలను కాపాడేందుకు అవకాశం ఉంటుందని అకస్మాత్తుగా గుండెపోటుకు గురైన వారిని గమనించివెంటనే ఏమాత్రం ఆలస్యం చేయకుండా సీపీఆర్ ప్రక్రియను అమలు చేయాలన్నారు. ఆహారపు అలవాట్లు, మారిన జీవనశైలి వంటి అనేక కారణాలతో ప్రస్తుతం అనేక మందికి ఆకస్మికంగా గుండెపోటు వస్తుందని అత్యవసర చికిత్స అందక మృతి చెందుతున్నారని ఇలాంటి సందర్భంలో అకస్మాత్తుగా గుండెపోటుకు గురైన వారికి సరైన విధానంలో సీపీఆర్ చేస్తే కనీసం పదిమందిలో ఐదుగురు బతికే అవకాశం ఉందన్నారు. సీపీఆర్ టెక్నిక్స్ తెలుసుకున్నవారు ఒక్కొక్కరు మరో 10మందికి నేర్పించాలని సమాజంలో ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారిని రసూల్‌బీ, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారిని కృష్ణవేణి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగోరావు, తదితరులు పాల్గొన్నారు.



సీపీఆర్‌పై శిక్షణకు హాజరైన సిబ్బంది



గద్దె వద్ద పూర్తయిన ఏర్పాట్లు



ఊర పండుగకు సిద్ధమైన విగ్రహాలు

నేడు ఊర పండుగ

• ఏర్పాట్లు పూర్తి చేసిన సర్వసమాజ్ కమిటీ

నిజామాబాద్ అర్బన్, జూలై 27: ప్రతీ ఏడాది నగరంలో జరుపుకునే అతిపెద్ద పండుగ ఊరపండుగకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆషాఢమాసంలో నిర్వహించే ఊర పండుగను ఆదివారం నిర్వహించనున్నారు. గత 75ఏళ్లుగా నగరంలోని అన్నికులాలు ఐక్యంగా నిర్వహించుకునే ఊర పండుగను ఘనంగా నిర్వహించేందుకు సర్వసమాజ్ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. నగరంలోని ఖిల్లా శారదాంబ గద్దె నుంచి ఉదయం 8గంటలకు దేవతల ఊరేగింపును నిర్వహించనున్నారు. గాజుల్‌పేట్, పెద్దబజార్ చౌరస్తా వరకు సాగే ఊరపండుగ అక్కడి నుంచి దుబ్బ, వినాయక్‌నగర్, సిర్నాపల్లి గడి వరకు నాలుగు విభాగాలుగా విడిపోయి తర్వాత నగరంలోని 14 గ్రామదేవతల గుడ్లకు విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి ప్రతిష్ఠించనున్నారు. గాజుల్‌పేట్ వద్ద సరి చల్లుకునే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఊరపండుగ నిర్వహించే ప్రాంతాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తిచేశారు. ఎక్కడ కూడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీస్ శాఖ భారీ బందోబస్తును ఏర్పాటు చేసింది. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్‌ను కూడా మళ్లింపు చేశారు. ఇప్పటికే మామిడి కర్రలతో తయారుచేసిన కొత్తదేవతా విగ్రహాలు సిద్ధమయ్యాయి. శనివారం ఖిల్లా గద్దెల వద్ద సర్వసమాజ్ కమిటీ అధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి బంటు రాజేశ్వర్, కోకన్వీనర్ ఆదె ప్రవీణ్ తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు. ఊరపండుగపై రూపొందించిన పాటను ఆవిష్కరించారు.

పాఠశాలలకు వాహనాలపై వచ్చే

మైనర్లను అనుమతించొద్దు

• పాఠశాలల హెడ్‌మాస్టర్లు, ప్రిన్సిపాల్లతో సమావేశంలో ట్రాఫిక్ ఏసీపీ నారాయణ



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ

ఖిల్లా, జూలై 27: పాఠశాలలకు, కళాశాలలకు మైనర్లు వాహనాలు తీసుకొస్తే వారిని ఆవరణలోనికి అనుమతించొద్దని ట్రాఫిక్ ఏసీపీ టి.నారాయణ సూచించారు. పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగనెవార్ ఆదేశాల మేరకు శనివారం కమీషనరేట్ కార్యాలయంలో వివిధ కళాశాలలు, పాఠశాలలకు చెందిన ప్రిన్సిపాళ్లు, హెడ్‌మాస్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుప్రమాదాల బారిన మైనర్లు పడకుండా ఉండేందుకు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎవరైనా మైనర్లు వాహనాల మీద వస్తే వారిని రావద్దని సూచించారు. అదేవిధంగా పాఠశాల, కళాశాలలకు దింపడానికి వచ్చే మైనర్లను కూడా అనుమతించరాదని తెలిపారు. ఈ విషయాన్ని మైనర్ల తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలని వారికి ఆదేశించారు. బైక్ నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ మాట్లాడరాదని, రాంగ్ రూట్‌లో వాహనాలు నడపొద్దని సూచించారు. ఇలా చేయడంతో రోడ్డుప్రమాదాలను నియంత్రించవచ్చని తెలిపారు. సమావేశంలో ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ, బోధన్ ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్, ఎస్సై రెహమత్ ఉల్లా, ఆర్ఎస్సై సుమన్, చంద్రశేఖర్, కళాశాలల, పాఠశాలల ప్రిన్సిపాళ్లు, హెడ్‌మాస్టర్లు పాల్గొన్నారు.



ఎస్సారెస్పీకి పెరుగుతున్న వరద

• ప్రాజెక్టులోకి వస్తున్న 35,078 క్యూసెక్కుల వరద • ప్రాజెక్టులోకి చేరిన 31 టీఎంసీల నీళ్లు

• వరద కాలువపై ఆశలు పెట్టుకున్న రైతులు • జిల్లాలో ఏకదాటిగా కురుస్తున్న వర్షం

నిజామాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద ప్రభావం పెరుగుతుంది. ఎగువ ప్రాంతాల్లో ఎడతెరపి లేకుండా పడుతున్న వర్షాలతో ఈ వరద వచ్చి చేరుతుంది. ఈ వర్షాలతో మంజీరా, గోదావరి, హరిదా నదులకు వరద వస్తుండటంతో ప్రాజెక్టుల్లో నీటిమట్టాలు క్రమేపి పెరుగుతున్నాయి. గత పది రోజులుగా పడుతున్న ఈ వర్షాలతో ప్రాజెక్టులో నీళ్లు 31 టీఎంసీలకు చేరగా ప్రతీరోజు 2 నుంచి 3 టీఎంసీల వరకు ప్రాజెక్టులోకి నీళ్లు వచ్చి చేరుతున్నాయి. ఈ వర్షాలు మరింత పెరిగితే భారీగా వరద ప్రాజెక్టులోకి వచ్చే అవకాశం ఉందని ఎస్సారెస్పీ అధికారులు అంచనా వేస్తున్నారు.

• 35,078 క్యూసెక్కుల చేరిక

శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద పెరిగింది. ఎగువ ప్రాంతాల నుంచి పడుతున్న వర్షాలతో గోదావరికి వరద ఎక్కువగా వస్తోంది. ప్రాజెక్టులోకి ప్రస్తుతం 35,078 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుంది. గోదావరితో పాటు మంజీరా, హరిదా నదుల ద్వారా ఈ వరద వస్తుండటం వల్ల ప్రాజెక్టులో నీటిమట్టాలు పెరుగుతున్నాయి. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా పరిధిలో కూడా భారీ వర్షాలు పడుతుండటం వల్ల వరద ఎక్కువ అవుతోంది. జిల్లాతోపాటు పక్కనే ఉన్న నిర్మల్ జిల్లాలో పడే వర్షాలతో కూడా వరద వస్తుండటంతో ప్రాజెక్టులో నీళ్లు పెరుగుతున్నాయి. భారీ నుంచి అతి భారీ వర్షాలు పడితే వరద ఎక్కువయ్యే అవకాశం ఉంది. గడిచిన పది రోజులుగా పడుతున్న వర్షాలతో ప్రాజెక్టులోకి 20 టీఎంసీల వరకు నీళ్లు వచ్చి చేరాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులకు గాను ప్రస్తుతం 1074.1 అడుగులకు నీళ్లు చేరాయి. ప్రాజెక్టులో పూర్తిస్థాయి కెపాసిటీ 80.5 టీఎంసీలకు గాను 31.035 టీఎంసీలకు నీళ్లు చేరాయి. ఎగువ ప్రాంతాల్లో పడుతున్న వర్షాలతో పాటు క్యాచ్‌మెంట్ ఏరియాలో పడుతున్న వర్షాల వల్ల ఈ నీళ్లు వస్తున్నాయి. గత సంవత్సరంతో పోలిస్తే వర్షాలు కొంతమేర తక్కువగా ఉండటం మహారాష్ట్రలోని గోదావరిపై ఉన్న ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండకపోవడం వల్ల ఇంకా భారీ వరద పెరగలేదు. ప్రాజెక్టు ఎగువన మహారాష్ట్రలో ఉన్న బాలేగాం, అందూరా, విష్ణుపురి ప్రాజెక్టులతో పాటు అతిపెద్ద జైక్వాడ్ ప్రాజెక్టు నిండితే మరింత వరద గోదావరికి పెరగనుంది. ఆ ప్రాజెక్టు నిండి గేట్లు ఎత్తితే ఎక్కువగా ప్రాజెక్టులోకి వరద వచ్చిచేరనుంది. ఎగువ ప్రాంతాల్లో పడుతున్న వర్షాలతో ఈ వరద వచ్చి చేరుతున్నట్లు ఎస్సారెస్పీ ఇంచార్జి ఎస్ఈ శ్రీనివాస్‌గుప్త, ఈఈ చక్రపాణి, ఏఈ వంశీలు తెలిపారు. అక్టోబర్ వరకు బాబ్లీ గేట్లు తెరిచి ఉండటం వర్షాలు పడే అవకాశం ఉండటం వల్ల నీళ్లు ఎక్కువ మొత్తంలో వస్తాయని వారు తెలిపారు.

• ఆయకట్టు రైతుల్లో భరోసా

ప్రాజెక్టులో వరద ఎక్కువగా వస్తుండటం నీటిమట్టాలు పెరుగుతుండటంతో ఆయకట్టు రైతుల్లో భరోసా పెరుగుతుంది. కాకతీయ, సరస్వతి, లక్ష్మి కాలువల ఆయకట్టు రైతులతో పాటు చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి, గుత్ప, అలీసాగర్ రైతులకు కూడా సాగునీరు అందనుండటంతో ఎక్కువ మొత్తంలో సాగును పెంచుతున్నారు. ప్రాజెక్టులోకి 40 టీఎంసీలకు పైగా నీళ్లు చేరితే వరద కాలువకు విడుదల చేయనుండటంతో ఆ కాలువల వెంట ఉన్న రైతులు వేచి చూస్తున్నారు. వరద కాలువను నింపి ఉంచడం వల్ల వేలాది మంది రైతులు ప్రతీ సంవత్సరం వేల ఎకరాల సాగును నిజామాబాద్ నుంచి కరీంనగర్ వరకు కొనసాగిస్తున్నారు. వరద కాలువల్లో నీళ్లు నిలువ ఉంచడం వల్ల మోటార్ల ద్వారా సాగుకు ఉపయోగిస్తున్నారు. గత కొన్నేళ్లుగా వరద కాలువల్లోని నీళ్లు ఉపయోగించి ఈ సాగును చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీళ్లు 31 టీఎంసీలకు పెరగడం వల్ల మరికొద్ది రోజుల్లోనే 40 టీఎంసీలకు చేరే అవకాశం ఉండటంతో రైతులు ఆశతో ఉన్నారు. ప్రాజెక్టు నిండితే వరద కాలువ ద్వారా నీటిని మిడ్‌మానేరు, ఎల్ఎండీ కూడా మళ్లించనున్నారు. ఎగువ ప్రాంతాల్లో పడే వర్షం ఆధారంగానే నీళ్లు వచ్చే అవకాశం ఉన్నందున భారీ వరద వస్తే అధికారులు నిర్ణయం తీసుకొని ఆయకట్టుకు నీళ్లు మళ్లించే అవకాశం ఉంది.

• జిల్లావ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం

జిల్లాలో వర్షం గత పది రోజులుగా ఎడతెరిపి లేకుండా పడుతూనే ఉంది. జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో ఈ వర్షం నమోదైంది. జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకు సరాసరి 11.7 మిల్లీ మీటర్ల వర్షం పడింది. జిల్లాలో అత్యధికంగా కమ్మర్‌పల్లి మండలంలో 20 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. జిల్లాలో ఇప్పటివరకు 395.1 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా 510.5 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లాలో సరాసరి కంటే 115 మిల్లీమీటర్ల వర్షం ఎక్కువగా పడింది. జిల్లాలోని 21 మండలాల్లో సరాసరి సగటు వర్షపాతం కంటే ఎక్కువగా వర్షం పడింది. జిల్లాలోని 12 మండలాల్లో సరాసరి సగటు వర్షపాతం నమోదైంది.

‘ప్రతిభకు పదును పెడితే విజయం దరి చేరుతుంది’

కోటగిరి, జూలై 27 : ప్రతి విద్యార్థి ప్రతిభకు పదును పెడితే విజయం దరి చేరుతుందని కల్ప తరువు ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ భాను శీరిషా పేర్కొన్నారు. కోటగిరి మండలం కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు కల్ప తరువు ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ చిన్నారులకు స్టేషనరీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు ఒకరికి సహాయం చేయాలని తమ ఫౌండేషన్ లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

‘విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి’

డిచ్‌పల్లి, జూలై 27 : తెలంగాణ విశ్వవిద్యాలయంలోని అర్థశాస్త్ర విభాగం పీజీ చివరి సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం శనివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విభాగాధిపతి డా.ఏ పున్నయ్య మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయం గొప్ప అనుభవాన్ని ఇస్తుందని,ఈ అనుభవంతో సమాజంలో బాధ్యత గల పౌరులుగా ఉండాలన్నారు. విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆరతి, రహీం దర్‌రెడ్డి, టి.సంపత్, స్వప్న, శ్రీనివాస్, దత్తహరి పాల్గొన్నారు

పోస్టర్ల ఆవిష్కరణ

నవీపేట, జూలై 27 : మండలంలోని అభంగపట్నంలో శనివారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 28న ఖమ్మం ఎస్‌ఆర్ గార్డెన్స్‌లో జరిగే సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ కేంద్రకమిటీ సభ్యులు రాయల చంద్రశేఖర్ సంతాప సభను విజయవంతం చేయాలని వారు కోరారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం

జక్రాన్‌పల్లి, జూలై 27 : మండలంలోని గన్యాతండా గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని మూగవ్యక్తి చౌహన్ అకాష్ అదృశ్యమైనట్టు సీహెచ్. తిరుపతి తెలిపారు. శనివారం ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం గన్యాతాండా గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని మూగవ్యక్తి చౌహన్‌అకాష్ ఇంటి నుంచి ఈనెల 25న మధ్యాహ్నా 3గంటల సమయంలో ఇంట్లో నుంచి బయటకు వెళ్ళి తిరిగిరాలేదన్నారు. అతని ఆచూకీ కోసం కుటుంబసభ్యులు గాలించినా ఆర్మూర్ వైపు నడుకుంటూ వెళ్ళాడని తెలిసి చుట్టు పక్కల గ్రామాల్లో వెతికినప్పటికీ ఏలాంటి ఆచూకీ తెలియరాలేదని అతని తండ్రి చౌహన్ కిషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు

విద్యార్థులకు పోటీలు

డిచ్‌పల్లి, జూలై 27 : తెలంగాణ విశ్వవిద్యాలయం బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో విద్యార్థులకు భారతదేశఅభివృద్ధిలో యువత పాత్ర అనే అంశం పై వక్తృత్వ పోటీలు శనివారం నిర్వహించారు. పోటీలకు విద్యార్థులు సందీప్, సుమిత్, సంగు, మధులు ఈవెంట్ మేనేజర్‌లుగా వ్యవహరించారు. పోటీల్లో మొదటి బహుమతి బాంధవ్య, ద్వితీయ బహుమతి సంతోశ్, తృతీయ బహుమతి గజేందర్‌లు అందుకున్నారు.

ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీకి కట్టుబడి ఉంది

● మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు



సమావేశంలో మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు

డిచ్‌పల్లి,జూలై 27: ప్రభుత్వం ఏర్పాటు సమయంలో రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీని నిలుపుకుటుందని 2లక్షల రుణమాఫీ కి ప్రభుత్వం కట్టుబడి ఉందని శనివారం సాయంత్రం మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు అన్నారు. మండంలోని ధర్మారం(బి) గ్రామంలోని ఆయన ఇంటిలో విలేకర్లతో మాట్లాడారు. తాను రైతుగా ప్రజాప్రతినిధిగా రైతాంగంలో ఉన్న రైతు రుణ మాఫీ అనుమానాలను నివృత్తి చేసుకునే విధంగా ఈ విలేకర్ల సమావేశం నిర్వహిస్తున్నమని రుణమాఫీ విషయంలో రైతులు మొదట దఫ రూ.1లక్ష, రెండో దఫా 1.5లక్షలు, మూడో దఫా 2లక్షల రుణ మాఫీ ప్రభుత్వం చేస్తుందని రుణ మాఫీ జరగని రై తులు ఆందోళన చెంద వద్దని రైతులకు ఏమైన అనుమానాలు ఉంటే వ్యవసాయాధికారుల వద్ద మాఫీ జాబితా ఉందని టెక్నికల్ సమస్యలతో కొన్ని చోట్ల ఆధార్ నంబర్, పేర్లు సక్రమంగా లేక పోవడంతో మాఫీ రాలే దని అలాంటి తప్పిదాలకు రైతులు నివృత్తి చేసుకోవాలన్నారు. రైతులు తప్పకుండా వ్యవసాయాధి కారులకు వద్ద వెళ్లి సరిచూసుకోవాలని ఆయన కోరారు. రుణమాఫీ జర గాని విషయం తన దృష్టి కి తీసుకురావడం వల్లే అధికారుల వద్ద నివేది కలు తెప్పించుకొని రైతులకు ఈ సూచనలు చేస్తున్నానని తెలిపారు. ధరణిలో పేర్లు తప్పులుగా ఉన్న రేషన్ కార్డులు లేని వారికి కూడా తహసీల్దార్, కలెక్టర్‌లు తాత్కలికంగా లోన్ అర్హత కోసం వారి వివరాలు ఇస్తారని మండవ స్పష్టం చేశారు. అప్పుల ఊబిలో చిక్కుకున్న రైతాంగం అస లు వడ్డీతో బయటపడలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఇచ్చిన మాటాకు కట్టుబడి రుణ మాఫీ చేసిందన్నారు. ఈవిలేకర్ల సమావేశంలో సీనియర్ నాయకులు బాగిర్తిబాగారెడ్డి,కిషన్‌రెడ్డి ఉన్నారు.

కొత్త ఆవిష్కరణలకు ఇంటింటా ఇన్నోవేటర్



ఏర్గట్లలో పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో వెంకటేశ్వర్లు

ఏర్గట్ల, జూలై 27: ప్రతీ ఒక్కరిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందని, దాన్ని వెలికి తీసి వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం నిర్వహిస్తోందని ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఇంటింటా ఇన్నోవేటర్ పోస్టర్‌లను ఆవిష్క రించారు. తమ ఆలోచనలు,సృజనాత్మకతను జోడించి ఎవరైనా దరఖాస్తు చేసుకోవాలని, దీనికి సంబంధించిన అవగాహన జిల్లా కోఆర్డినేటర్ సందీప్ రాజ్ వివరించారు. ఈకార్యక్రమంలో డీఎల్‌పీవో శివకృష్ణ, ఎంపీవో శివచరణ్, ఏపీఎమ్ శ్యామ్, ఐకేపీ సీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనులపై అసంతృప్తి



లంగ్డాపూర్‌ని సందర్శించిన జిల్లా పంచాయతీ అధికారి

బోధన్‌రూరల్,జూలై27: బోధన్ మండలంలోని బర్దీపూర్, లంగ్డాపూర్, తదితర గ్రామాలలో జిల్లా పంచాయతీ అధికారి, బోధన్ మండల ప్రత్యేక అధికారి సీహెచ్, తరుణ్ కుమార్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలలో పారిశుధ్య పనులను, ప్రభుత్వ పాఠశాలల్లో పనులను పరిశీలించారు. గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం, అమ్మ ఆదర్శ పాఠశాల పనులపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుధ్య పనులు ఈ విధంగా ఉంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత కాంట్రాక్టర్‌ను పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనులు చేయకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్‌ను ప్రభుత్వ నిబంధనలతో పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఎంపీడీవో బాల గంగాధర్, ఎంపీవో మధుకర్, ఏపీవో హేమలత, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్థులు పాల్గొన్నారు.

డిగ్రీ వన్‌టైం పరీక్షలు ప్రశాంతం

డిచ్‌పల్లి,జూలై 27: తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ బ్యాక్‌లగ్ వన్‌టైం పరీక్షలు శని వారం 25వరోజు ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ తెలిపారు. అనుబంధ కళాశాల పరిధిలో ఉదయం జరిగిన పరీక్షకు 22విద్యార్థులకుగాను 20మంది హాజర య్యారని,ఇద్దరువిద్యార్థులు గైర్హాజరని ఆడిట్‌సెల్ డైరెక్టర్ ఆయన తెలిపారు.

బోధన్ మున్సిపాలిటీలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

బోధన్‌రూరల్,జూలై27: బోధన్ మున్సిపాలిటీలో అత్యవరస కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు బోధన్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి అన్నారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బోధన్ పట్టణంలో ఇటీవల కురిసిన వర్షాలకు ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే వెంటనే మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూమ్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.పట్టణంలోని తదితర వార్డులకు ప్రత్యేక ఇన్‌చార్జులను నియమించామన్నారు. పాత బోధన్‌లో మట్టి ఇళ్లలో నివాసం ఉండే వారు ఇల్లులు ఖాళీ చేసి ఇతర చోట్ల ఉండాలన్నారు. ప్రజలకు అవసరమైతే పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. వర్షాల పట్ల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, చిన్న పిల్లలను విద్యుత్ స్తంభాల వద్దకు వెళ్లకుండా చూడాలన్నారు.

విద్యార్థి అదృశ్యం

బోధన్‌రూరల్,జూలై27: బోధన్ పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన విద్యార్థి అదృశ్యమైనట్లు తల్లిదండ్రులు శనివారం ఫిర్యాదులో పేర్కొన్నట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఇంటికి వెళ్లి తిరిగి వచ్చి సాయంత్రం సమయంలో బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులకు పాఠశాల నిర్వాహకులు తెలుపగా కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. సీసీపుటేజీలో అన్నికోణాల్లో పరిశీలించి తప్పిపోయినబాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తామన్నారు.

కొనసాగుతున్న ఇంటిగ్రేటెడ్ పీజీ సెమిస్టర్ పరీక్షలు

డిచ్‌పల్లి,జూలై 27: విశ్వవిద్యాలయం పరిధిలోని పీజీ ఇంటిగ్రెటెడ్ ఏపీఈ, ఐపీసీహెచ్, ఐఎంబీఏ 6,8,10వ సెమిస్టర్ , ఎల్‌ఎల్‌బీ 6, ఎంబీఏ, ఎంసీఏ 1,3వ సెమిస్టర్, ఐఎంబీఏ 7,9 వసెమిస్టర్ రెగ్యూలర్, బ్యాక్‌లగ్ పరీక్షలు శుక్రవారం 11వ రోజు ప్రశాంతంగా జరిగాయని ఆడిట్‌సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ తెలిపారు. ఆర్ట్స్ కళాశాల, న్యాయ కళాశాలలో జరిగిన పరీక్షల్లో 78మంది విద్యార్థులకు గాను 71మంది పరీక్షకు హాజర య్యారని 7గురు గైర్హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ తెలిపారు.

అనుమానాస్పద మృతిపై కేసు నమోదు

బోధన్‌రూరల్,జూలై27: బోధన్ మండలం పెద్దమావంది గ్రామానికి చెందిన సూర్య సురేష్(35)అనే వ్యక్తి శుక్రవారం ఉదయం మృతి చెందగా మృతిపై అనుమానాలు ఉన్నాయని మృతుడి అక్క పోశవ్వ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ నాగనాథ్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. శుక్రవారం ఉదయం మృతుడి భార్య కావ్య సూర్య సురేష్ మృతి చెందాడని ఏడవడంతో అంత్యక్రియల సమయంలో అనుమానాలు తలెత్తాయని మృతుడి అక్క పోశవ్వ ఫిర్యాదులో పేర్కొందన్నారు. పోశవ్వ ఫిర్యాదు మేరకు అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

చిత్తడిగా మారిన వారసంత

● ఇబ్బందులు పడుతున్న అమ్మకందారులు, కొనుగోలుదారులు ● పట్టించుకోని సంబంధిత అధికారులు



చిత్తడిగా మారిన నవీపేట సంత



సంతలో ఇబ్బందులు పడుతున్న అమ్మకందారులు, కొనుగోలుదారులు

నవీపేట,జూలై27:నవీపేటగ్రామపంచాయతీ పరిధిలోని సంత స్థలం చిత్తడిగా మారింది. ఇదే సంతలో ప్రతీ శుక్రవారం వారంతపు సంత, శనివారం మేకల సంతను నిర్వహిస్తుంటారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు సంత పూర్తిగా బురదమయంగా మారింది. దీంతో శుక్రవారం జరిగిన వారంతపు సంతలో అమ్మకందారులు, కొనుగోలుదారులు ఇబ్బ ందులు పడగా శనివారం సైతం మేకల సంతలో అమ్మకందారులు, కొనుగోలుదారులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొన్నారు. గ్రామ పంచాయతీకి వారంతపు సంత, మేకల సంతల ద్వారా ప్రతీ సంవత్సరం లక్షలాది రూపాయల ఆదాయం సమకూరుతున్నప్పటికీ సంతలో కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సంతలో నెలకొన్న బురదను తొలగించి మొరంతో చదును చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

● భారీగా మేకల క్రయ, విక్రయాలు

ఆదివారం జరిగే బోనాల పండుగను పురస్కరించుకుని నవీపేటలో శనివారం జరిగిన మేకల సంతలో జోరుగా క్రయ,విక్రయాలు జరిగాయి.పండుగను పురస్కరించుకుని వ్యాపారులు జీవాలను అధిక ధరలకు విక్రయించారని కొనుగోలుదారులు పేర్కొన్నారు. ధరలు ఎక్కువ అయినప్పటికీ భారీగా క్రయ, విక్రయాలు జరిగాయి. జిల్లాలోని పలు ప్రాం తాలతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల నుండి పెద్ద ఎత్తున కొనుగోలుదారులు నవీపేట సంతకు తరలివచ్చిజీవాలను కొనుగోలు అమ్మకాలు చేశారు. అధికారులు స్పందించాలన్నారు.

ఉపాధ్యాయులు లేక మూతబడిన ఉర్దూ పాఠశాలలు

● మూడేళ్లుగా ఉపాధ్యాయులేక మూత బడిన పాఠశాలలు ● విద్యకు దూరమైన విద్యార్థులు ● పాఠశాలను తెరిపించాలని తల్లిదండ్రుల విన్నపం ● పట్టించుకోని అధికారులు



సిరికొండ ఉర్దూ మీడియం పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు(ఫైల్)

సిరికొండ జూలై 27: అన్ని భాషల వారికి విద్య అందుబాటులోకి తీసుకరావలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఉర్దూ మీడియం పాఠశాలలు ఉపాధ్యాయులేక మూతబడి మూడేళ్ల కావస్తున్న ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. సిరికొండ మండలంలోని పెద్దవాల్గొట్, సిరికొండ గ్రామాల్లో సుమారు పదిహేనేళ్ల క్రితం ఉర్దూ మీడియం పాఠశాలలను ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సుమారు పది, పన్నేడేళ్ల పాఠశాలలు బాగా పనిచేశాయి. అప్పట్లో ఉపాధ్యాయులు ఉండడం వల్ల విద్యార్థులు సైతం పాఠశాలలకు వచ్చి విద్యాభ్యాసం చేశారు. మూడు నాలుగేళ్ల క్రితం ఉపాధ్యాయులు బదిలీ కావడంలో స్థానికంగా ఉండే మైనారిటీ సంఘాలు ఒక ఏడాది పాటు విద్యావాలంటీర్లను పెట్టుకుని తమ పిల్లలకు విద్యను అందించడానికి కృషి చేశారు.మళ్లీ నియమించుకోవడానికి డబ్బుల్లేక పోవడం వల్ల పాఠశాలలు మూత బడ్డాయి. పాఠశాలలు మూతబడి మూడేళ్లు కావస్తున్న ప్రభుత్వం పట్టించుకోక పోవడం బాధకరమని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. పెద్దవాల్గొట్ స్కూల్లో 50 నుంచి 60 మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుతం వారందరిని ప్రభుత్వం ప్రాథమికి పాఠశాలలో పంపిస్తున్నారు.సిరికొండ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుల 2022లో 317 జీవో వల్ల ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లడంతో ఆ ఏడాది విద్యా వాలంటీర్‌ను ఏర్పాటు చేసుకుని తమ పిల్లలకు విద్యాబోధన చేయించినట్లు మైనారిటీ నాయకుడు ముషీర్ తెలిపారు. ఆర్థిక సహాయం చేసే వారు లేక పోవడంతో విద్యావాలంటీర్ ను తిరిగి నియమించుకోలేక పోయినట్లు తల్లిదండ్రులు తెలిపారు.దీని వల్ల పాఠశాల మూత బడిందన్నారు.సుమారు 45మంది పిల్లలు పాఠశాలకు వచ్చే వారని మైనారిటీ సంఘ నాయకుడు ఆసీఫ్ తెలిపారు.ఉపాధ్యాయులను నియమించాలని ఇటీవల సిరికొండకు వచ్చిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతును కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు ఆసీఫ్ కోరారు.

ఉపాధ్యాయులను నియమించి పాఠశాలలు తెరిపించాలి

మూతబడిని పాఠశాలలకు ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం అన్ని భాషల వారికి వారి వారి మాతృ భాషలో విద్యా బోధన చేయించాలనే సదాశయంతో ఏర్పాటు చేసిన పాఠశాలలను తిరిగి తెలిరిపించాలని మైనారిటీ సంఘం మండల నాయకులు లియాకత్ ప్రభుత్వాన్ని కోరారు.

-లియాకత్, గ్రామస్థుడు

అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

● సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసిన అదనపు జేసీ అంకిత్

సిరికొండ జూలై 27: ప్రజా పాలనలో తీసుకున్న పథకాల అమలు కోసం ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను రిజిస్టర్‌లో ఏ రోజుకారోజు ఎందుకు రాయడం లేదని అదనపు కలెక్టర్ అంకిత్ మండల పరిషత్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా అదనపు (స్థానిక సంస్థల) కలెక్టర్ అంకిత్ శనివారం సిరికొండలో ఆకస్మిక పర్యటన చేశారు. మొదట మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. ప్రజాపాలనకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. మండలంలో ప్రజాపాలనలో అమలు అవుతున్న పథకాలలో గృహజ్యోతి, వంటగ్యాస్ వంటి పథకాలు వర్తిండం లేదని దరఖాస్తులు చేసుకున్న వారు ఎంత మంది దరఖాస్తులు చేసుకున్నారని. అనిసిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వచ్చిన దరఖాస్తులను ఏరోజుకారోజు రిజిస్టర్‌లో రాశారా? అనిఅడిగితే సిబ్బంది సరియైన సమాధానం చెప్పక పోవడంతో అదనపు కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. వచ్చిన దరఖాస్తులను ఖచ్చితంగా రిజిస్టర్‌లో నోట్ చేయాలని సిబ్బందికి సూచించారు. పల్లె ప్రకృతి వనాన్ని అదనపు జేసీ పరిశీలించి సూచనలు చేశారు. హైస్కూల్‌కు వెళ్లి టీచర్లు విద్యాబోధన ఎలా చేస్తున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను విద్యావంతులుగా ఎదిగే విధంగా తీర్చిదిద్దాలని ప్రధానోపాధ్యాయుడు సతీష్‌కుమార్‌కు సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని కూడా పరిశీలించారు. రుచికరంగా వంటలు చేయాలని ఆయన వంట చేసే ఏజెన్సీ సభ్యులకు సూచించారు.ఆయన వెంట ఇన్‌చార్జీఎంపీడీవో తారచంద్ నాయక్, పంచాయతీకార్యదర్శులు,ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో చంద్రశేఖర్, సాంకేతిక సహాయకులు ఉన్నారు.



సిరికొండలో ప్రజా పాలన రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

బోధన్‌లో ఘనంగా ఊర పండుగ

బోధన్‌రూరల్,జూలై27: బోధన్‌లో ఇటీవల నిర్వహించిన ఊర పండుగలో భాగంగా శనివారం మర్గవ్వ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. పట్టణంలోని తట్టికోట ప్రాంతంలో ఉన్న మర్గవ్వ దేవాలయం నుండి పోతరాజుల విన్యాసాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వర్షాలు సమృద్ధిగా సకాలంలో కురువాలని, పాడిపంటలు చల్లగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి

ఆర్మూర్‌రూరల్, జూలై27: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని మరింత బలోపేతం చేసి సత్తా చాటాలని బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు శివప్రసాద్ అన్నారు. శనివారం ఆలూర్ మండల కేంద్రంలో జరిగిన మండల కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, పార్టీ కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు. ఈకార్యక్రమంలో ఆలూర్ మండల బీజేపీ అధ్యక్షుడు కొత్తూరు గిరిష్, ప్రధానకార్యదర్శి శ్రీకాంత్, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బండారి యాదగిరి, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మహేష్, లోక రాంరెడ్డి, నడిసెరం మల్లయ్య, ప్రళయ్‌తేజ, హరిష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌కు ఢీకున్న బైక్, ఒకరి మృతి

వేల్పూర్, జూలై27: వేల్పూర్ మండలం వెంకటాపూర్ గ్రామంలో రోడ్డు పక్కన నిలిపి ఉన్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొనగా అదే గ్రామానికి చెందిన సంతోష్ అనే వ్యక్తి మృతి చెందినట్టు ఎస్సై వినయ్ తెలిపారు. సంతోష్ వెంకటాపూర్ గ్రామ శివారులో ఆర్డర్‌మెస్‌లో కోళ్ళను దించడానికి తన బైక్‌పై ఇంటి నుంచి వెళ్లి తిరిగి వస్తుండగా గ్రామ మాలసంఘం వద్ద రోడ్డుపై ఎలాంటి పార్కింగ్ సిగ్నల్స్ పెట్టకుండా కొండల మహిపాల్ నిలిపి ఉంచిన ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. దీంతో సంతోష్ తలకు బలమైన గాయాలై రక్తస్రవం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుని భార్య బాగ్యలక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో కోసం పది వేలు అందజేత

ఏర్గట్ల, జులై 27: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గత ఏడు నెలలుగా మధ్యాహ్న భోజనం అందించకపోవడంతో సోషన్ జస్టిస్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా డైరెక్టర్ కట్కం శామంత్, ఆర్మూర్ డివిజన్ చైర్మన్ నరేష్‌లు 10 వేలు పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోషన్ జస్టిస్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ చైర్మన్ కొప్పుల విజయ్ కుమార్, జనరల్ సెక్రెటరీ మనోహర్ ఆదేశాల మేరకు విషయం తెలుసుకుని మధ్యాహ్న భోజనానికి విరాళం అందజేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనన ఏర్పాటుపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఆంద్రయ్య, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోర్తాడ్‌లో అబ్దుల్‌కలాం వర్ధంతి

మోర్తాడ్, జూలై27:మండల కేంద్రంలో శనివారం దళిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం వరో వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. అబ్దుల్‌కలాం చిత్రపటానికి దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లూరి ఎం.రాజారాం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భారత రాష్ట్రపతిగా సేవలందించారని, మిస్ట యిల్ మ్యాన్ ఆఫ్ ఇండియా భారతరత్న ప్రభుత్వం గౌరవించిందని అ న్నారు. విద్యార్థులు, యువకులు ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకో వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జంబవ చామర్ మామిడి రవి, రాజు, నరేందర్, అమర్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: భారత మాజీ రాష్ట్రపతి శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి ని పురస్కరించుకుని సిరికొండలో ఉపాధ్యాయులు కలాం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఓ పాఠశాలలో కలాం వర్ధంతి హెచ్‌ఎం మాట్లాడుతూ అణు వైజ్ఞానికి రంగంలో విప్లవాత్మక మార్పులతో భారత ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన ఏపీజే అబ్దుల్ కలాం అపరమేధావని కొనియాడారు. శాస్త్రవేత్తగా,రాష్ట్రపతిగా అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. మరో పాఠశాలలో కూడ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించుకున్నారు. పాఠశాల హెచ్‌ఎం కలాం దేశానికి చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు.ఈ కార్యకక్రమాల్లో ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గోన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

బోధన్‌రూరల్,జూలై27: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని వర్ద్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని మధుమలాంచ, కల్దుర్కి ఉన్నత పాఠశాలలో 8,9,10వ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు కౌమర దశలో వచ్చే మార్పుల గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనత, చట్టాలపై అవగాహన కల్పించారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మధుమలాంచ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు నరేందర్, కల్దుర్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగయ్య, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఛలో హైదరాబాదును విజయవంతం చేయాలి

ఎడపల్లి, జూలై27: పంచాయతీ కార్మికుల సమస్య పరిష్కారం కోసం ఈ నెల 30 న చేపట్టిన ఛలో హైదరాబాదును విజయవంతం చేయాలని తెలంగాణ గ్రామ పంచాయితీ ఎంప్లాయిమెంట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్ అన్నారు. శనివారం ఎడపల్లి మండల కేంద్రంలో ఛలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు జొగ్గరి పద్మ, మండల నాయకురాలు లక్ష్మి, మండల కోశాధికారి కుంట సంతోష్, శ్రీను, ప్రశాంత్, ప్రవీణ్, మల్లమ్మ, పోశెట్టి, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేస్తున్న మండల ప్రత్యేక అధికారి

జక్రాన్‌పల్లి, జూలై27: విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనాన్ని వండి వడ్డించాలని మండల ప్రత్యేక అధికారి, పీడీ తిరుమల ప్రసాద్ అన్నారు. శని వారం జక్రాన్‌పల్లిలోని కేజీబీవీ పాఠశాలను మండల ప్రత్యేక అధికారి తిరుమల ప్రసాద్ ఎంపీడీవో సతీష్‌కుమార్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి వివరాలు అడిగితెలుసుకున్నారు.పాఠశాలలోని రిజిష్టర్‌లను పరిశీలించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని మంచిగా వండి వడ్డించాలని వంట ఏజెన్సీలకు సూచించారు.అనంతరం పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థులకు సీజల్‌వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్నారు.పరిశుభ్రతను పాటిస్తూ రోగాలు తమ దరిచేరవని విద్యార్థులు పరిశుభ్రతను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వప్న, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈవో

ఆర్మూర్‌రూరల్, జులై27: ఆర్మూర్ మండలంలోని వివిధ గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలను శనివారం మండల విద్యాధికారి రాజగంగారాం తనిఖీ చేశారు. అంకాపూర్‌లోని ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, బీసీకాలనీలోని ప్రాథమిక పాఠశాలను, ఆర్మూర్‌లోని కమలానెహ్రూ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపుపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని శుచి, శుభ్రతతో విద్యార్థులకు అందించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

ప్రమాదకరంగా కల్వర్టు కథనానికి స్పందన



బోధన్‌లో కల్వర్టు వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసిన దృశ్యం

బోధన్‌రూరల్,జూలై27: ఆంధ్రజ్యోతి దినపత్రికలో గురువారం ప్రచురితమైన ప్రమాదకరంగా కల్వర్టు కథనానికి అధికారులు స్పందించారు. ఆర్డీవో ఆదేశాల మేరకు ఆర్ అండ్ బీ అధికారులు ప్రమాదకర కల్వర్టును సందర్శించారు. ప్రమాదాల నివారణ కోసం బారికేడ్లను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా బోధన్ ఆర్డీవో అంబాదాస్ రాజేశ్వర్ మాట్లాడుతూ ప్రమాదకర కల్వర్టుల వద్దకు ప్రజలు వెళ్లకూడదని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించిన కమిషనర్



అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఆర్మూర్‌టౌన్, జూలై27: పట్టణంలోని పలు అంగన్‌వాడి కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ రాజు శనివారం పరిశీలించారు. వర్షాలు పడడంతో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున కేంద్రాల చుట్టు పక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చిన్నారులకు మెను ప్రకారం నాణ్యమైన భోజనం అందించి గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని అంగన్‌వాడి టీచర్‌లను ఆదేశించారు.ఆయన వెంటసానిటరీ ఇన్‌స్పెక్టార్ గజానంద్,ఎన్విరాల్‌మెంట్ ఇంజనీర్ పూర్ణమౌళి, తదితరులు ఉన్నారు.

రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపొద్దు

బోధన్‌రూరల్,జూలై27: వాహనదారులు రాంగ్‌రూట్‌లో నడపొద్దని పట్టణ సీఐ వీరయ్య అన్నారు. శుక్రవారం రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తున్న 15వాహనాలను గుర్తించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తబస్టాండ్, పాత బస్టాండ్, శక్కర్‌నగర్ చౌరస్తా, సాత్‌పుల్, రైల్వేట్రాక్ తదితర ప్రాంతాలలో రాంగ్‌రూట్‌లో ద్విచక్ర వాహనదారులు ప్రయాణిస్తున్నారని వీటి వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఇక నుండి కొత్త చట్టాలు అముల్లోకి వచ్చాయని ఇక నుండి రాంగ్‌రూట్‌లో వెళ్లిన భారీ జరిమానాలతో పాటు వాహనాలను సీజ్ చేస్తామన్నారు. వాహనదారులు తప్పకుండా వాహన నియమ, నిబంధనలు పాటించాలన్నారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేస్తున్నామన్నారు. తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలని ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

మండల గ్రామాల్లో పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లు

కోటగిరి,జూలై27: పోతంగల్ మండలంలోని పలు గ్రామాలలో వర్షాలకు ఆరు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని తహసీల్దాన్ మల్లయ్య తెలిపారు. జల్లాపల్లిలో 1, జల్లాపల్లి ఫారంలో 1,కల్లూర్‌లో 1, కారేగాంలో 2, దోమలెడ్గిలో 1చొప్పున వర్షాలకు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని ఆర్థిక సహాయం కోసం ఉన్నతాధికారులకు సమాచారం అందించామన్నారు.

అథ్లెటిక్స్ క్రీడాకారుడికి ఆర్థిక సహాయం

పెర్కిట్, జూలై27: తెలంగాణ ఇజ్రాయిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం అథ్లెటిక్స్ క్రీడాకారుడు అజయ్‌కు రూ.20వేల ఆర్థిక సహాయం అందజేశారు. అసోసియేషన్ సభ్యులు మహేష్‌గౌడ్, ఎల్లాప్రసాద్, సాగర్‌లు మాట్లాడుతూ పట్టణానికి చెందిన అజయ్ జాతీయస్థాయిలో రాణిస్తున్నందున అతని మెరుగైన ప్రదర్శన కోసం శిక్షణ పొందడానికి గాను అసోసియేషన్ తరఫున ఆర్థిక సహాయం చేసినట్టు తెలిపారు.

వర్సిటీలకు రెగ్యులర్ వీసీలను నియమించాలి

● ఏబీవీపీ నాయకులు డిమాండ్

డిచ్‌పల్లి,జూలై 27:తెలంగాణ యూనివర్సిటీతో పాటు రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకు ప్రభుత్వం తక్షణమే రెగ్యూలర్ వైస్ చాన్స్‌లర్‌లను నియామించాలని ఏబీవీపీ జాతీయకార్యవర్గ సభ్యుడు శివా డిమాండ్ చేశారు. శనివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరినిరసనగా వర్సిటీ కళాశాల ఎదుట పోస్టర్ ల ను ఆవిష్కరించారు.రాష్ట్రంలో యూనివర్సిటీల పరిస్థితి ప్రభుత్వం రెగ్యులర్ వీసీలను నియామించకపోవడంతో అధ్వాన్నంగా మారిం దని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు శివా విమర్శించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సాయికుమార్, అమృత్ చారి, నాగరాజు, అనిల్, హరినాథ్, సమీర్, గజేందర్, అక్షయ్, సాయి పాల్గొన్నారు.

గోవూర్ స్కూల్‌కు హెచ్‌ఎంను నియమించాలి

మోస్రా,జూలై27: మోస్రా మండలంలోని గోవూర్ ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిని నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ యువకులు మండల విద్యాశాఖ అధికారి నాగనాథ్‌కు గోవూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద వసతి వినతిపత్రం అందజేశారు.జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే ప్రధానోపాధ్యాయుడిని నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు సత్యనారాయణ, గంగాప్రసాద్, నర్సయ్య, సాయిలు, సాబేర్, ప్రకాష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

బహుజన రాజ్యాధికారంతో అన్ని సమస్యలకు పరిష్కారం

• హైకోర్టు న్యాయమూర్తి చంద్రకుమార్

పెద్దబజార్, జూలై27: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, అగ్రకుల పేదలైన బహుజన ప్రజల సకల సమస్యలకు బహుజన రాజ్యాధికారం ద్వారా మాత్రమే పరిష్కారమవుతాయని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. శనివారం నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో నిజామాబాద్ ఉమ్మడి భూసదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ భారత దేశంలో ఏరాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణలో బహుజన కులాల ప్రజలు 93శాతం ఉన్నారని అన్నారు. 93శాతం ఉన్న బహుజన శ్రామిక ప్రజల రాజకీయ నాయకత్వంలో ఏర్పడే బహుజన రాజ్యాధికారంలో మాత్రమే బహుజన శ్రామిక ప్రజల సకల సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. బీఎల్‌ఎఫ్ చైర్మన్ నల్ల సూర్యప్రకాశ్ మాట్లాడుతూ మార్క్సిజం, అంబేద్కరిజం సైద్ధాంతిక రాజకీయ ఆలోచనా విధానంతో తెలంగాణలో బహుజన రాజ్యాధికారం దీర్ఘకాలిక లక్ష్యంతో ఉద్యమిస్తున్న బీఎల్‌ఎఫ్‌ను గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా అభివృద్ధికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఎల్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్లు దండివెంకట్, వనం సుధాకర్, వెంకటస్వామి, రాష్ట్ర నాయకులు సిద్ధిరాములు, రమేష్‌యాదవ్, కృష్ణ, సాయి, అశోక్‌గౌడ్, జగదీశ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో అదనపు సెక్షన్ మంజూరు

నిజామాబాద్ అర్బన్, జూలై 27: జిల్లా కేంద్రంలో ఉన్న కేంద్రీయ విద్యాలయంలో 1వ తరగతిలో అదనపు సెక్షన్‌ను మంజూరు చేశారు. ఈమేరకు అదనపు సెక్షన్ మంజూరు చేస్తూ అనుమతి ఉత్తర్వులు ఇచ్చారు. కేంద్రీయ విద్యాలయంలో అదనపు సెక్షన్ మంజూరు కోసం రెండునెలల క్రితం వీఎంసీ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పార్లమెంట్‌సభ్యుడు ధర్మపురి అర్వింద్‌ను కోరగా ఆయన అదనపు సెక్షన్ మంజూరు చేయాలని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కోరగా ఎంపీ విజ్ఞప్తిమేరకు అదనపు సెక్షన్‌ను మంజూరుచేశారు. కేంద్రీయ విద్యాలయంలో ఇప్పటికే అడ్మిషన్ల ప్రక్రియ మొదలుకాగా మొత్తం 132 దరఖాస్తులు వచ్చాయి. కేంద్రీయ విద్యాలయ నియమనిబంధనలకు అనుగుణంగా ఈనెల 22న లాటరీ పద్ధతిలో అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహించారు. ఎంపికైన విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రస్తుతం కొనసాగుతోంది. మరోవారం రోజుల్లో తరగతులు ప్రారంభం కానున్నాయి. అదనపు సెక్షన్‌కు సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు. అదనపు సెక్షన్‌మంజూరు పట్ల ఎంపీ అర్వింద్ హర్షం వ్యక్తంచేశారు. ఆయన కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అదనపుసెక్షన్ మంజూరుకు కృషిచేసిన ఎంపీ అర్వింద్‌కు వీఎంసీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు.

'కార్మికుల హక్కులను కాలరాస్తున్నారు'

పెద్దబజార్, జూలై27: చట్టాలను మార్చి 4కోడ్‌లుగా చేసి కేంద్రంలోని బీజేపీ సర్కారు కార్మికుల హక్కులను కాలరాస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ అన్నారు. శనివారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆశావర్కర్ల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా వారు హాజరై మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగినన్ని నిధులను కేటాయించలేకపోవడంతో కార్మిక సమస్యల పట్ల వారి వైఖరిని తెలియజేస్తుందన్నారు. పెట్టుబడిదారులకు కేంద్రం, బీజేపీ, ఎన్డీఏ ప్రభుత్వం రూ.10లక్షల కోట్ల ప్రజాధనాన్ని రాయితీల రూపంలో చెల్లించి కార్మికవర్గాన్ని మాత్రం కనీస వేతనాలను అమలు చేయకుండా, సౌకర్యాలను పెంచకుండా పోరాడి సాధించుకున్న చట్టాలను మార్చివేయడం సరైందికాదన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల్లో పనిచేసే ఆశావర్కర్లకు, అంగన్‌వాడిలకు, మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా కార్మికుల పట్ల వివక్ష చూపుతున్నారని అన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు రామ్మోహన్‌రావు, యూనియన్ నాయకులు సుకన్య, స్వప్న, రేణుక, రమ,సరిత, పద్మ, దివ్య, శోభ, ఇందిర, రాణి పాల్గొన్నారు.

డిపార్ట్‌మెంటల్ స్టోర్‌ను తనిఖీ చేసిన చీఫ్ ఇంజనీర్

సుభాష్‌నగర్, జూలై27: టీజీఎన్‌పీడీసీఎల్ నిజామాబాద్ సర్కిల్ డిపార్ట్‌మెంటల్ స్టర్‌ను చీఫ్ ఇంజనీర్ తిరుమల్‌రావు పరిశీలించారు. జిల్లాకేంద్రంలోని పవర్‌హౌజ్ కంపౌండ్ కార్యాలయఆవరణలోని డిపార్ట్‌మెంటల్ స్టోర్‌లో తనిఖీలు నిర్వహించి అక్కడున్న అధికారులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా తిరుమల్‌రావు మాట్లాడుతూ నిజామాబాద్ సర్కిల్ పరిధిలో కొత్త సర్వీసుల మంజూరుకు కావాల్సిన మెటీరియల్ సమృద్ధిగా ఉందని తెలిపారు. వంగిన విద్యుత్ పోల్స్ సరిచేయడం, చెడిపోయిన ఇన్సూలేటర్లు మార్చడం, కాలం చెల్లిన రాడ్లు, స్టేవైర్లు మార్చడం, లూస్‌వైర్‌లను సరిచేయడం, అన్ని రకాల పనులకు మెటీరియల్ స్టోర్‌లో అందుబాటులో ఉందని తెలిపారు. కొత్త వ్యవసాయ కనెక్షన్‌లు, గృహ కనెక్షన్‌లు, మీటర్లు, సామాగ్రి తదితర మెటీరియల్ ఉన్నాయని వివరించారు. వర్షాకాలం రాబోయే వరద దృష్ట్యా ముందస్తు చర్యల్లో భాగంగా ఎక్కడ లోటు లేకుండా మెటీరియల్ అందుబాటులో ఉందన్నారు. విద్యుత్‌ఉద్యోగులు 24గంటలపాటు విద్యుత్‌ను అందించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

వనమహోత్సవాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

• అదనపు కలెక్టర్ అంకిత్

ధర్పల్లి, జూలై27: వన మహోత్సవ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోగల మండల పరిషత్, ఐకేపీ, ఉపాధి హామీ కార్యాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా ఉపాధి హామీ కార్యాలయానికి వెళ్లిన ఆయన రికార్డులను పరిశీలించారు. మండల టార్గెట్‌ను, గ్రామ టార్గెట్ ను అడిగి తెలుసుకున్నారు. మనమహోత్సవ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో యువతను భాగస్వాములను చేయాలని సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. దరఖాస్తుల స్వీకరణ, రిజిస్టర్ల పరిశీలన తదితర వాటిని సీనియర్ అసిస్టెంట్ గంగాధర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రజాపాలన దరఖాస్తులు ఏ మేరకు వచ్చాయి, ఎన్ని పరిశీలించారు, రికార్డుల నమోదు అడిగి తెలుసుకున్నారు. ప్రజాపాలన దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆయా గ్రామాల నుంచి వచ్చిన దరఖాస్తుదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుం డా చూడాలని సూచించారు. అంతకుము ందు ఐకేపీ కార్యాలయాన్ని పరిశీలించి యూనిఫాంల నిర్వహణపై సంబంధిత సీసీలను అడిగితెలుసుకొని సలహాలను ఇచ్చారు. ఆయన వెంట ఆయా శాఖల అధికారులు ఉన్నారు.



వివరాలు అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్



పాఠశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

గుండారం జెడ్పీహెచ్‌ఎస్‌లో వనమహోత్సవం

నిజామాబాద్ రూరల్, జూలై, 27: రూరల్ మండలం గుండారం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో వనమహోత్సవం నిర్వహించారు. శనివారం ఉదయం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు అమర్‌నాథ్ మొక్కలు నాటించారు. నాటిన మొక్కలను రక్షిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞచేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అమర్‌నాథ్, డాక్టర్ దస్తగిరి, అహల్య, పుష్పలత, భగవాన్ దాస్, వినోద్ తదితరులున్నారు.

రూరల్ ఎంపీడీవోగా సుబ్రహ్మణ్యం బాధ్యతల స్వీకరణ

నిజామాబాద్‌రూరల్, జూలై27: నిజామాబాద్ రూరల్ మండల ఎంపీడీవోగా ఎం.సుబ్రహ్మణ్యం బాధ్యతలు చేపట్టారు. మెదక్ జిల్లా నుంచి వచ్చిన సుబ్రహ్మణ్యం శనివారం రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో చార్జి తీసుకున్నారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించిన మధురిమ మోస్రా మండలానికి బదిలీఅయ్యారు. సుబ్రహ్మణ్యం ఇంతకుముందు రూరల్ మండలంలో ఈవోపీఆర్‌డీగా విధులు నిర్వహించి పదోన్నతిపై సిద్దిపేటకు వెళ్లారు. తిరిగి సొంత మండలానికి ఎంపీడీవోగా పదోన్నతిపై రావడంతో రూరల్ అధికారులు, సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు. రూరల్ మండల సూపరిటెండెంట్‌గా కమ్మర్‌పల్లి మండలంలో విధులు నిర్వహించిన గంగాధర్ కూడా శనివారం బాధ్యతలు చేపట్టారు. డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్‌రెడ్డి స్థానంలో గంగాధర్ బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, సూపరింటిండెంట్ గంగాధర్‌లకు సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. కార్యక్రమంలో ఏపీవో పద్మ, టీఏలు హరీందర్, రెడ్డి, ప్రశాంత్, శివ, ఉమారాణి, నారాయణ, తదితరులున్నారు.

• విద్యుత్ తీగల కింద మొక్కలు నాటొద్దు: ఎంపీడీవో

వనమహోత్సవంలో భాగంగా రూరల్ మండలంలోని గ్రామాల్లో విరివిగా చెట్లు నాటాలని, నెట్లు నాటేముందు అన్నిజాగ్రత్తలు పాటించాలని ఎంపీడీవో సుబ్రహ్మణ్యం సూచించారు. శనివారం రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు వనమహోత్సవంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మొక్కలు నాటే ముందు విద్యుత్ తీగల కింద మొక్కలు నాటవద్దని హెచ్చరించారు. గతంలో నాటిన చెట్లను కొట్టేసినవారిని గుర్తించివారికి నోటీసులు ఇవ్వాలన్నారు. రోడ్లకు ఇరువైపులా పెద్దగా ఎత్తు పెరగని పూల మొక్కలు నాటేందుకు ఆసక్తి చూపాలన్నారు. సమావేశంలో ఏపీవో దేవనమీన పద్మ, టీఏలు ప్రభాకర్ రెడ్డి, హరీందర్, సూపరింటెండెంట్ గంగాధర్ తదితరులున్నారు.

పాఠశాలల్లో ఘనంగా బోనాల పండుగ

నిజామాబాద్‌అర్బన్, జూలై27: బోనాల పండుగను పలు పాఠశాలల్లో ఘనంగా జరుపుకున్నారు. నిజామాబాద్ నగరంలోని ఆర్యనగర్‌లో గల ఫ్యూచర్ లైన్ కిడ్స్ పాఠశాలలో బోనాల పండుగ సందర్భంగా చిన్నారులు బోనాలు ఎత్తుకొని ఆటపాటలతో సందడిచేశారు. బోనాల పండుగ సంస్కృతిని తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రియాంక స్వప్న తెలిపారు.

• అమ్రాద్ జిల్లా పరిషత్ పాఠశాలలో..

నగర శివారులోని అమ్రాద్ జిల్లా పరిషత్ పాఠశాలలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పోతరాజుల వేషాధారణలో అలరించగా బాలికలు బోనాల సందర్భంగా ప్రత్యేక సాంప్రదాయ వస్త్రాధరణలో ఆకట్టుకున్నారు. సరస్వతీ మాతకు నైవేద్యం పెట్టి బోనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. బోనాల పండుగ గొప్పతనాన్ని నేటి తరానికి తెలియజేయాలనే ఉద్దేశ్యంతో కార్యక్రమం నిర్వహించినట్లు హెచ్ఎం సురేష్ తెలిపారు. కార్యక్రమంలో డ్రాయింగ్ టీచర్ రమేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

• సిర్పూర్ పాఠశాలలో బోనాల పండుగ

మోపాల్: తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పే సంప్రదాయాన్ని నిలబెట్టే పండుగ బోనాల పండుగ అని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సిర్పూర్ ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ అన్నారు. శనివారం మండలంలోని సిర్పూర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బోనాల పండుగను విద్యార్థుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సాంప్రదాయాన్ని చాటిచెప్పే బోనాల పండుగల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముత్యంరెడ్డి, వీడీసీ సభ్యులు రాజేందర్, నరేష్, గాయత్రీ, వందన, శ్యామల, లత, ఈశ్వర ట్రస్ట్ సభ్యులు తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయానికి పుస్తకాల అందజేత

నిజామాబాద్ అర్బన్, జూలై27: జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయానికి విద్యార్థులకు, పాఠకులకు సౌకర్యార్థం రిటైర్డ్ కోఆపరేటివ్ సబ్ రిజిస్ట్రార్ భూమయ్య శనివారం పుస్తకాలను అందజేశారు. ఎన్‌సీఈఆర్‌టీ పదవ తరగతి, ఇంటర్మీడియెట్, జేఈఈ మెయిన్స్, బీఈడీ, బీటెక్, కంప్యూటర్ సైన్స్ పుస్తకాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

ఇందల్వాయి, జూలై27: ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అశోక్ ఆకస్మికంగా తనిఖీచేశారు. ఇందులోభాగంగా చిన్నపిల్లలకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. టీకాలు ఇచ్చే సెషన్స్ ఎన్ని వాటి వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సిన్‌ల భద్రత, శీతలీకరణ పద్ధతులు సక్రమంగా నిర్వహించాలని ఫార్మసిస్టు విజయలక్ష్మికి సూచించారు. చిన్నపిల్లలకు ఇచ్చే బీసీజీ వ్యాక్సిన్ క్షయవ్యాధి రాకుండా ఉపయోగపడుతుందని హైపర్‌టైటీస్ ఈ వ్యాక్సిన్ పచ్చ కామర్లు రాకుండా ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతీ బుధవారం, శనివారం అన్నిరకాల వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. ప్రతీ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారి శంకర్, ఫార్మసిస్టు విజయలక్ష్మి, ఆనంద్, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

ఖిల్లా, జూలై 27: నగరంలో ఊరపండుగ సందర్భంగా ఆదివారం ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు సీపీ కల్మేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పండుగ ఊరేగింపు ఖిల్లా చౌరస్తా నుంచి సిర్నాపల్లి గడి, గోల్‌హనుమాన్, వినాయక్‌నగర్, దుబ్బ జీజీకాలేజ్ ప్రాంతంలో ఉండటంతో ట్రాఫిక్‌ను దారి మళ్లిస్తున్నట్లు తెలిపారు. బోధన్ నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు అర్సపల్లి, న్యూకలెక్టరేట్, జీజీకాలేజీ, ఫ్లైఓవర్ మీదుగా బస్టాండ్‌కు చేరుకోవాలని అన్నారు. భారీ వాహనాలు కలెక్టరేట్ బైపాస్ మీదుగా మాధవ్‌నగర్ వెళ్లాలన్నారు. బస్టాండ్ నుంచి బోధన్‌వెళ్లే ఆర్టీసీ బస్సులు రైల్వేస్టేషన్, గాంధీచౌక్, నెహ్రూపార్క్, బోధన్ బస్టాండ్ మీదుగా వెళ్లాలన్నారు. హైదరాబాద్ నుంచి బోధన్ వెళ్లే వాహనాలు మాధవనగర్ బైపాస్, న్యూకలెక్టరేట్, అర్సపల్లి మీదుగా వెళ్లాలన్నారు. ఖిల్లా చౌరస్తా నుంచి సిర్నాపల్లి (గోల్‌హనుమాన్) వెళ్లేవారు వేరేమార్గం నుంచి వెళ్లాలన్నారు. ప్రజలు ఊరపండుగను ప్రశాంతంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా జరుపుకునేందుకు పోలీసులకు సహకరించాలని కోరారు.

ఇద్దరు ఏసీపీలకు అదనపు ఎస్పీలుగా పదోన్నతులు

ఖిల్లా, జూలై27: జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు ఏసీపీలు అదనపు ఎస్పీలుగా పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వీరు వెంటనే డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్త ఈ ఉత్తర్వులను జారీచేశారు. ఆర్మూర్ ఏసీపీగా పనిచేస్తున్న జి.బస్వారెడ్డి, నిజామాబాద్‌లో సీసీఎస్ ఏసీపీగా పనిచేస్తున్న బి.కిషన్‌లకు పదోన్నతి కల్పించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బస్వారెడ్డి ఆర్మూర్ ఏసీపీగా వచ్చారు. వీరికి పదోన్నతి కల్పించగా వీరి స్థానంలో త్వరలో కొత్తవారిని నియమించనున్నారు.

ఆగస్టు 15 తర్వాత వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి: సీపీ

ఖిల్లా, జూలై 27: ఆగస్టు 15 తర్వాత ద్విచక్ర వాహనాలు నడిపేవారు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగెనవార్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో హెల్మెట్ తప్పనిసరి అమలు చేస్తామని తెలిపారు. వాహనదారులు తమ వ్యక్తిగత రక్షణ నిమిత్తం తప్పక హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే కేసులునమోదు చేస్తామని హెచ్చరించారు.

విద్యుత్‌శాఖ అధికారులకు సీఎండీ అభినందనలు

సుభాష్‌నగర్, జూలై 27: వర్షాలు విస్తారంగా కురుస్తున్నా వినియోగదారులకు విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందిస్తున్న జిల్లా అధికారులకు సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అభినందనలు తెలిపినట్లు నిజామాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న చోట సిబ్బంది తక్షణమే స్పందించి విద్యుత్ సరఫరా యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించడంలో వారిసేవలను కొనియాడినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు సర్కిల్ పరిధిలో గడిచిన నాలుగు నెలల్లో 1300 వంగిన విద్యుత్ స్తంభాలు, 260 తుప్పు పట్టిన స్తంభాలు వదులుగా 11 కిలోమీటర్ల లైన్‌లు, 110స్టేవైర్లు మార్చామని తెలిపారు.

యువకుడిని అభినందించిన పోలీసులు

ధర్పల్లి, జూలై27: మండలంలోని ధమ్మన్నపేటకు చెందిన సిసింద్రిని పోలీసులు శనివారం అభినందించారు. రామడుగు నుంచి వెళ్తుండగా రోడ్డుపై పర్సు దొరకగా దాన్ని పీఎస్‌లో అప్పచెప్పాడు. పర్సులో రూ.6వేల పాటు కార్డులు ఉన్నాయన్నారు. నిజాయితీగా పర్సు అప్పగించిన సిసింద్రిని ఎస్సై విక్రమ్ అభినందించారు.

ఇందల్వాయి సొసైటీ చైర్మన్, సీఈవోపై అవినీతి ఆరోపణలు!

• రూ.కోటికిపైగా అవకతవకలు జరిగినట్లు డీసీవోకు డైరెక్టర్లు ఫిర్యాదు?

ఇందల్వాయి, జూలై27: ఇందల్వాయి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో పెద్దఎత్తున నిధుల గోల్‌మాల్ జరిగినట్లు తెలుస్తోంది. రూ.కోట్లలో అవకతవకలు జరిగాయని ఈ నిధుల గోల్‌మాల్ విషయంలో చైర్మన్, సొసైటీ సీఈవోలే కారణమని సొసైటీ పాలకవర్గం డైరెక్టర్లు డీసీవో శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. సొసైటీ పరిధిలో ఎరువులు, ధాన్యం కొనుగోలు రైతులకు ఇచ్చే రుణాల విషయంలో అవకతవకలు జరిగినట్లు మండల రైతులు చర్చించుకుంటున్నారు. ఈ వ్యవహారం మొత్తానికి సొసైటీ చైర్మన్, సీఈవోల పరిధిలో జరిగిందని తెలుస్తుంది. సొసైటీలోని మిగతా పాలకవర్గానికి సమాచారం ఇవ్వకుండా చైర్మన్, సీఈవోలు కలిసి మొత్తం లావాదేవీలను తప్పుడు లెక్కలు చూపిస్తూ అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈవిషయంపై పాలకవర్గంలోని వైస్‌చైర్మన్‌తోపాటు, 12మంది డైరెక్టర్లు రెండు రోజులపాటు రహస్యంగా సమావేశం ఏర్పాటు చేసుకొని సొసైటీలో జరిగిన అవకతవకల గురించి సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. అనంతరం నిధుల దుర్వినియోగంపై పది మంది డైరెక్టర్లు వెళ్లి డీసీవో శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ విషయంపై పూర్తిసమాచారాన్ని బయటకి పొక్కకుండా జాగ్రత్త పడుతున్నారు. దీనిపై ఒకరిద్దరు కాంగ్రెస్ నాయకులు జోక్యం చేసుకొని సొసైటీ లెక్కల్లో జరిగిన అవకతవకల గురించి బయటకు రాకుండా చూడాలని డైరెక్టర్లతో మాట్లాడినట్లు సమాచారం. విషయం బయటకి వస్తే సొసైటీ పరువు పోతుందని డైరెక్టర్లను సముదాయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే సొసైటీలో జరిగిన గోల్‌మాల్ గురించి మండల రైతులు చర్చించుకుంటున్నారు. త్వరలోనే ఆడిట్ నిర్వహించి జరిగిన అవకతవకల బహిర్గతం చేయాలని రైతులు కోరుతున్నారు.

మల్లారం అడవిలో వృద్ధురాలు

నిజామాబాద్‌రూరల్, జూలై27: రూరల్ మండలం మల్లారం దట్టమైన అటవీ ప్రాంతంలో ఓ వృద్ధురాలు పడిఉండటం చూసి స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. సుమారు 70 ఏళ్ల మహిళ మాట్లాడలేని స్థితిలో ఉండగా వృద్ధురాలిని చికిత్స కోసం స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. వృద్ధురాలి వివరాలు తెలిసినవారు రూరల్ పోలీసులకు 8712659849 నెంబర్‌కు సమాచారం అందించాలని రూరల్ ఎస్‌హెచ్‌వో జి.మహేష్ తెలిపారు.



చికిత్స పొందుతున్న వృద్ధురాలు



మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

చల్లగరిగె పాఠశాలలో మాక్ పోలింగ్

ధర్పల్లి, జూలై 27: మండలంలోని చల్లగరిగె ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం మాక్‌పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం నర్సిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు జరిగే విధానంపై విద్యార్థుల అవగాహన కల్పించేందుకు మాక్‌పోలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికలు జరిగే విధానం, ఓటు విలువ, ఓటుహక్కు వినియోగించే విధానాన్ని వివరించారు. విద్యార్థులు మాక్ పోలింగ్‌లో పాల్గొని ఓటు వేసి పాఠశాల లీడర్, గేమ్స్ లీడర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ప్రోగ్రాంలో విద్యార్థిని ప్రతిభ

ధర్పల్లి, జూలై 27: మండల కేంద్రంలోగల మోడల్ పాఠశాలకు చెందిన ఎడ్ల సంజన రాష్ట్రస్థాయిలో నిర్వహించిన సుకుర సైన్స్ ప్రోగ్రాంలో ప్రథమ స్థానం పొందడంతో ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు. ఆమెను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేంద్రసాహెబ్, అధ్యాపకబృందం, అమ్మఆదర్శ పాఠశాల చైర్మన్, పీటీఏ చైర్మన్ పాల్గొన్నారు.

'ఎండీఎం కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి'

పెద్దబజార్, జూలై27: మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చిన హామీ నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన హామీలను జాతీయ స్కీమ్ వర్కర్స్ పరిధిలో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారంపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కేంద్ర నిధులను కలుపుకొని భోజన కార్మికులకు మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చిన హామీల ప్రకారం 10వేల వేతనం చెల్లించాలన్నారు. నిత్యవసర వస్తువులు, వంటగ్యాస్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

చికెన్ ధరలు





రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.100	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	: రూ.105	రూ.225	రూ. 245

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.72,000	రూ.66,400	రూ.870

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : డెడ్‌పూల్ (తెలుగు 3డీ) (10.15, 1.15)
: డెడ్‌పూల్ (ఇంగ్లీష్ 3డీ) (4.15, 7.15, 10.15)
స్క్రీన్-2 : కల్కి (3డీ తెలుగు) (11.20, 6.15)
: రాయాన్ (3.05, 10.00)
స్క్రీన్-3 : బ్యాడ్ న్యూజ్ (హిందీ) (10.00, 4.15, 10.30)
: పురుషోత్తముడు (1.05)
: ఆపరేషన్ రావన్ (7.20)
స్క్రీన్-4 : రామ్ ఎన్‌ఆర్ఐ (10.10)
: గల్లీ గ్యాంగ్ స్టార్స్ (1.00)
: ట్విస్టర్స్ (ఇంగ్లీష్) (4.20)
: రాయన్ (7.10)
: పురుషోత్తముడు (10.20)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : రాయన్ (10.45, 1.35, 4.30, 7.25, 10.20)
స్క్రీన్-2 : డెడ్‌పూల్ (తెలుగు 3డీ) (1.40, 7.30)
: కల్కి (తెలుగు) (4.15, 10.20)
స్క్రీన్-3 : డెడ్‌పూల్ (తెలుగు 3డీ) (10.40, 10.40)
: కల్కి (1.20, 7.20)
: డెడ్‌పూల్ (ఇంగ్లీష్ 3డీ) (4.45)

దేవి : రాయన్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : డెడ్‌పూల్ (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కల్కి (11.15, 2.15, 6.15, 9.15)



\- నిజామాబాద్ అర్బన్